




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 8 సంచిక : 339

పేజీలు : 4 వెల రూ.4/-

**Circulated by :** Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 22 ఏప్రిల్ 2025


## మే 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి రాక కట్టుదిట్టమైన ఏర్పాట్లు...






**విజయవాడ,కలంకౌంటర్ :** మే 2న ప్రధానమంత్రి నరేంద్ర మోడి అమరావతి రాజధాని పనుల పునః ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం విజయవాడలోని జలవనరుల శాఖ రైతు శిక్షణా కేంద్రంలో మంత్రుల బృందం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించింది. ఈసందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో ముఖ్యంగా ఆహారం,తాగునీరు వంటి వసతుల కల్పనలో ఎంత మాత్రం రాజీ పడరాదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రధాని సభా ప్రాంగణానికి చేరుకునే రహదారులను మెరుగుపరచాలని మంత్రి కేశవ్ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ ప్రధాని పర్యటన రోజు ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని పోలీస్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు.ప్రధాని సభకు వచ్చే సామాన్య ప్రజలకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వరకూ చాలా గ్రామీణ రహదారులై ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.గతంలో చిలకలూరిపేట, విశాఖపట్నం లలో ప్రధాని పర్యటన సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రధాని సభను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ఈసమావేశంలో ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ టెంటటివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని అక్కడ నుండి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయం సమీపంలోని హెలీఫ్యాడ్ కు చేరుకుని అక్కడ నుండి రోడ్డు షో ద్వారా సచివాలయం వెనుక వైపున గల ప్రధాన వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఈకార్యమానికి సంబంధించి విధులు కేటా యించిన అధికారులు వారి టీంలతో కలిసి ఆయా పనులు సక్రమంగా జరిగేలా చూసుకో వాలని చెప్పారు. ఈకార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు ఇతర ఏవిధమైన సమస్యలున్నా నోడలు అధికారి వీరపాండ్యన్ తో సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రధానమంత్రి కార్యక్రమాల పర్యవేక్షణ నోడలు అధికారి వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రధాని పర్యటన ఏర్పాట్లను వివరిస్తూ టెంటటివివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధాన మంత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని వివరించారు. తదుపరి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాల యం వద్ద గల హెలీఫ్యాడ్ కు 3.20గం.లకు చేరుకుంటారని తెలిపారు. అనంతరం అక్కడ నుండి ప్రధాన వేదిక వరకు సుమారు 1.2 కి.మీల పొడవునా రోడ్డు షో నిర్వహిస్తారని వివరించారు.రోడ్డుషోలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.అంతేగాక సాంస్కృతిక బృందాల ప్రదర్శన ద్వారా స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు.3.35గం.లకు సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన అమరావతి ఫెవిలియన్ కు చేరుకుంటారని తదుపరి 3.45గం.లకు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని వివరించారు. సాయంత్రం 5గం.ల ప్రాంతంలో ప్రధాని హెలీఫ్యాడ్ కు చేరుకుని హెలికాప్టర్లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని విమానంలో బయలుదేరి వెళతారని అన్నారు.మొత్తం మీద సుమారు రెండు గంటల పాటు సాగే ప్రధాని పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

**ప్రధాని పర్యటనకు సంబంధించి 10 పార్కింగ్..** స్థలాలను ఏర్పాటు చేసి అక్కడ తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.వివిఐపిలకు కరకట్ట, సీడ్ యాక్సిస్ రోడ్లను ప్రత్యేకంగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక సామాన్య ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు వీలుగా విజయవాడ నుండి మరో రెండు రూట్లు,గుంటూరు నుండి నాలుగు రూట్లను, మరికొన్ని తాత్కాలిక రూట్లను కూడా ట్రాఫిక్ కు అంతరాయాలు లేని విధంగా తీర్చిదిద్దనున్నట్టు పేర్కొన్నారు.ఆయా రోడ్లన్నీ పాట్ హెూల్ ఫ్రీ రోడ్లుగా తీర్చి దిద్దాలని ఆర్ అండ్బి అధికారులకు సూచించారు. ఆయా రోడ్లపై గల వివిధ బాటిల్ నెక్స్ ను సరి చేయాలని చెప్పారు.వివిధ జిల్లాల నుండి సభకు తీసుకువచ్చే వారందరికీ అల్పాహారం,తాగునీరు, మజ్జిగ,పండ్లు,భోజనం వంటివి పంపిణీ చేయాలని సంబంధిత ఇన్చార్జులకు సూచించారు.ఈవిషయంలో రాజీ పడవద్దని ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చుసుకోవాలన్నారు. ఈనెల 29 సాయంత్రానికి మొత్తం ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆయా అధికారులకు చెప్పారు.30వ తేదీన రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పిజి రిహార్సల్స్ ఉంటాయని తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించి ఆయా అధికారులకు కేటాయించిన పనులను వారి బృందాలతో సక్రమంగా జరిగేలా చూసుకోవాలని ప్రతి రోజు పర్యటించి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. అంతేగాక ఏర్పాట్లకు సంబంధించి ప్రతి రోజు సా.4గం.లకు డైలీ నివేదికను సమర్పించాలని వీరపాండ్యన్ చెప్పారు. ఈసమావేశంలో జిఏడి ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు,అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ మదుసూధన్ రెడ్డి,ఎన్టిఆర్,కృష్ణా,గుంటూరు జిల్లాల కలెక్టర్లు లక్ష్మిష, బాలాజీ,నాగలక్ష్మి,వివిధ శాఖల అధికారులు,పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 12న మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి త్వరలో ఏడాది పూర్తి కానుంది.గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఊహించని స్థాయిలో విజయం సాధించి, 175 స్థానాలలో 164 స్థానాల్లో విజయం సాధించింది. జూన్ 12, 2024న నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది జూన్ 12న ఎన్డీఏ ప్రభుత్వ పాలనకు సంవత్సరం పూర్తి కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం భారీ శుభవార్తను అందించనుంది. మూడు లక్షల పేదలకు ఇళ్లను అందిస్తూ, అదేరోజు వారితో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించనున్నారు.

**ఇళ్ల నిర్మాణంపై చర్యలు వేగవంతం..** ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 1.70 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. మరో 60 వేల ఇళ్లు తుది దశలో ఉన్నాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తిచేయడానికి ప్రభుత్వం అదనపు సాయం అందిస్తోంది.

**ప్రతిరోజూ సమీక్ష..** ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్న లక్ష్యంతో హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ నిత్యం జిల్లా కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులుతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. నిర్మాణ పురోగతిని అనుసరించేందుకు తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతతో పాటు సమయపాలనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. గృహప్రవేశం కార్యక్రమాన్ని జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నిర్ణయం పేద ప్రజల ఆశలకు వెలుగు నింపనుండగా, ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పరంగా తీసుకుంటున్న చిత్తశుద్ధిని మరోసారి చూపిస్తున్నదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి త్వరలో ఏడాది పూర్తి కానుంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఊహించని స్థాయిలో విజయం సాధించి, 175 స్థానాలలో 164 స్థానాల్లో విజయం సాధించింది. జూన్ 12, 2024న నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది జూన్ 12న ఎన్డీఏ ప్రభుత్వ పాలనకు సంవత్సరం పూర్తి కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం భారీ శుభవార్తను అందించనుంది. మూడు లక్షల పేదలకు ఇళ్లను అందిస్తూ, అదేరోజు వారితో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించనున్నారు.

## 202 మీటర్లు పూర్తైన పోలవరం డయాఫ్రమ్ వాల్

- డయాఫ్రమ్ వాల్ తో పాటే సమాంతరంగా ఈ సి ఆర్ ఎఫ్ పనులు
- 2027 చివరి నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తాం



**రాజమండ్రి, కలంకౌంటర్ :** పోలవరం ప్రాజెక్టు దయాఫ్రం వాల్ కు సంబంధించి ఇప్పటివరకు 202 మీటర్ల నిర్మాణం పూర్తయినట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డయాఫ్రం వాల్ జగన్ పాలనలో విధ్వంసానికి గురికాగా నేడు కూటమి ప్రభుత్వంలో నిర్మాణం దశగా పనులు సాగుతున్నాయన్నారు. కొత్తగా దయా ఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను 990 కోట్లతో జనవరి 18న మొదలుపెట్టామని తెలిపారు. రెండు కట్టర్లు, రెండు గ్రాబర్లతో దయా ఫ్రమ్ వాల్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి అన్నారు. ఏప్రిల్ 30 కల్లా మూడవ కట్టర్ కూడా అందుబాటులోకి రానుందన్నారు. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాపర్ డ్యామును, బలోపేతం చేయడానికి బట్రస్ డ్యాం, మే నెలకల్లా పూర్తి చేస్తామని చెప్పారు. చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా, ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. దయాఫ్రం వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, సమాంతరంగా గ్యాప్-1 వద్ద, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణాన్ని ఏప్రిల్ నెలలో మొదలుపెట్టామని మంత్రి తెలిపారు. గ్యాప్-2 వద్ద ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ఈ ఏడాది నవంబర్-30 లోగా మొదలు పెట్టేలా, చంద్రబాబు ప్రణాళికలను అమలు చేస్తామని, వచ్చే 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా పనులు మరింత వేగవంతం చేస్తామన్నారు. చంద్రబాబు ఇటీవల జరిపిన రివ్యూలో 2027 లో గోదావరి పుష్కరాలు ఉన్నందున ఆ ఏడాది జూన్ కల్లా పూర్తయ్యేలా చూడాలని చెప్పారని, సాధ్యమైనంత వరకు అప్పట్లోగా పూర్తయ్యేందుకు పనులను వేగవంతం చేస్తామని లేనియెడల అనుకున్న లక్ష్యానికి కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. గత జగన్ ప్రభుత్వంలో లెఫ్ట్ కెనాల్ కు అర బస్తా సిమెంట్ గాని, రూపాయి పని నోచుకోలేదు అన్నారు. కుటమి ప్రభుత్వం 1200 కోట్లతో టెండర్లు పిలవడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గోదావరి వరద జలాలు లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు, తరలిస్తామని, తద్వారా ఉత్తరాంధ్ర కు సాగు, తాగు అందుతుందన్నారు. ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

## పోప్ మృతి వార్త ఎంతగానో కలచివేసింది: జగన్

- పోప్ ఫ్రాన్సిస్ మృతిపై జగన్ స్పందన
- సంతాప ప్రకటన విడుదల
- క్రీస్తు విశ్వాసులపై చెరగని ముద్రవేశారని వెల్లడి




**అమరావతి,కలంకౌంటర్ :** క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సంతాపాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. పోప్ ఫ్రాన్సిస్ క్యాథలిక్ చర్చికి అధినేతగా విశేషమైన సేవలు అందించారని జగన్ కొనియాడారు. ఆయన హయాంలో చర్చి వ్యవస్థలో పరివర్తనాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రీస్తు విశ్వాసులపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. లాటిన్ అమెరికా ప్రాంతం నుంచి ఈ అత్యున్నత పదవికి ఎన్నికైన తొలి వ్యక్తిగా పోప్ ఫ్రాన్సిస్ చరిత్ర సృష్టించారని జగన్ కీర్తించారు. పోప్ ఫ్రాన్సిస్ కేవలం మత పెద్దగానే కాకుండా, ఒక నిజమైన మానవతావాదిగా నిలిచారని వైఎస్ జగన్ అభివర్ణించారు. ప్రపంచ శాంతి కోసం... పేదలు, అణగారిన వర్గాల పట్ల కరుణ చూపడంలో ఆయన ఎల్లప్పుడూ ముందున్నారని కొనియాడారు. ఆయన వినయం, మానవత్వం ప్రపంచాన్ని ఎంతగానో స్పృశించాయని పేర్కొన్నారు. శాంతి, కరుణ కోసం ఆయన గొంతుక ప్రపంచవ్యాప్తంగా వినిపించిందని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని తాను ప్రార్థిస్తున్నట్లు వైఎస్ జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచానికి, ముఖ్యంగా క్యాథలిక్ సమాజానికి ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు.

## అమెరికా ఉపాధ్యక్షుడు సతీమణికి అరుదైన గిఫ్ట్ ఇవ్వనున్న కేంద్ర రైల్వే శాఖ..

**అమరావతి,కలంకౌంటర్ :** ఇండియా పర్యటనకు వస్తున్న జేడీ వాన్సన్ సతీమణి ఉషా వాన్స్ కు మెమెంటోను ఇవ్వనున్న రైల్వే అధికారులు. ఉషా వాన్స్ మూలాలు ఉన్న కృష్ణా జిల్లా ఉయ్యూరు గ్రామ సమీపంలోని రైల్వే స్టేషన్ మెమోంటోను గిఫ్ట్ ఇవ్వాలని నిర్ణయం. ఈమేరకు అధికారికంగా భారత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారు కాగానే ఇండియాకు వస్తున్న ఉషా వాన్స్ కు మెమెంటోను బహుకరించనున్న కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్. క్రిష్ణా జిల్లా సాయిపురం సమీపంలోని రైల్వే స్టేషన్ వివరాలను కేంద్ర రైల్వే శాఖకు పంపిన విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు. సాయిపురం సమీపంలోని వెంటప్రగడ, గుడివాడ, సత్యవాడ తణుకు రైల్వే స్టేషన్ల వివరాలను సేకరించి కేంద్ర రైల్వే శాఖకు పంపిన విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు. కృష్ణా జిల్లా ఉయ్యూరు సాయిపురం గ్రామం సమీపంలో ఉషా వాన్స్ కుటుంబ సభ్యుల మూలాలు.. 1970వ సంవత్సరంలో కృష్ణా జిల్లా నుంచి వలస వెళ్లిన ఉషా వాన్స్ తల్లి తండ్రులు శ్రీలక్ష్మి, రాధాకృష్ణలు.




# ఆరోగ్య భారత్ ఆవిష్కృతమవుతోంది

● క్యాన్సర్ చికిత్సల్లో విప్లవాత్మక ఆవిష్కరణలు ● అత్యాధునిక వైద్య సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలి ● సేవా దృక్పథంతో పేదలకు చికిత్సలను అందించాలి ● సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శంకుస్థాపన సందర్భంగా రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ● పేద ప్రజలకు క్యాన్సర్ చికిత్సలందించడంలో సిటిజెన్ ఫోర్స్ మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్ష ● రాష్ట్ర మంత్రి పార్థసారథిచే సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లినిక్ ప్రారంభం





**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆరోగ్య భారత్ ఆవిష్కృతమవుతోందని రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. కృష్ణాజిల్లా ముల్లపూడిలో నిర్మించబడుతున్న సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కు ఆదివారం ఆమె వర్చువల్ విధానంలో శంకుస్థాపన జరిపారు. పటమట కృష్ణవేణి స్కూల్ రోడ్డులోని సిటిజెన్ ఫోర్స్ కార్యాలయం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో పురంధేశ్వరి ప్రసంగిస్తూ.. క్యాన్సర్ చికిత్సల్లో అనేక విప్లవాత్మక ఆవిష్కరణలు వెలుగుచూస్తున్నాయని, అత్యాధునిక వైద్య సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని అన్నారు. ప్రజలకు మెరుగైన క్యాన్సర్ చికిత్సలందించేందుకు సిటిజెన్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ ముందుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద ప్రజలకు క్యాన్సర్ చికిత్సలందించడంలో సిటిజెన్ ఫోర్స్ మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. వైద్య రంగంలో సేవా దృక్పథం వృద్ధి చెందాలని, నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుని ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సంపూర్ణ ఆరోగ్య భారతం ఆవిష్కరించబడుతోందని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ లో క్యాన్సర్ సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు మొత్తం రూ.99,858.56 కోట్లు కేటాయించగా, ఆరోగ్య పరిశోధన శాఖకు రూ.3,900.69 కోట్లు కేటాయించారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో అన్ని జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోందని, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 200 కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. క్యాన్సర్ తదితర అరుదైన వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే వివిధ ఔషధాలను ప్రాథమిక కస్టమ్స్ సుంకం నుండి పూర్తిగా మినహాయించారని చెప్పారు. ఎన్డీయే నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని పురంధేశ్వరి వెల్లడించారు. వైద్యో నారాయణో హరిః అని డాక్టర్లను దేవుళ్లుగా చూసే మన దేశ మహోన్నత సంస్కృతిని మరింత దృఢపరిచే విధంగా సేవా దృక్పథంతో సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ వైద్య సంస్థకు రూపకల్పన చేసిన పి. రమేష్ బాబు, తట్టి అర్జునరావులకు ఎంపీ పురంధేశ్వరి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లినిక్ ను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యున్నత శ్రేణి క్యాన్సర్ వైద్య సేవలను అందించేందుకు సిటిజెన్ ఫోర్స్ ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం, సిటిజెన్ ఫోర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం స్వచ్ఛందంగా క్యాన్సర్ వైద్య వికిత్సలు అందించాలనే లక్ష్యంతో ఈ హాస్పిటల్ ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పూర్తి సేవాభావంతో పేద ప్రజల పాలిట సంజీవనిగా సిటిజెన్ ఫోర్స్ హాస్పిటల్ సేవలందిస్తుందని అన్నారు. బంగారం స్వచ్ఛతకు హాల్ మార్క్ లాగా.. వైద్య రంగంలో స్వచ్ఛతకు ప్రామాణికంగా సిటిజెన్ ఫోర్స్ నిలుస్తుందని రమేష్ బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, వర్ల కుమార్ రాజా, బీజేపీ ఏపీ మీడియా ఇంచార్జి పాతూరి నాగభూషణం, టీడీపీ నేత బొప్పన భవకుమార్, కార్పొరేటర్లు చెన్నుపాటి క్రాంతిశ్రీ, దేవినేని అపర్ణ, సిటిజన్ ఫోర్స్ ప్రతినిధులు డాక్టర్ లలిత, డాక్టర్ కె. వంశీకృష్ణ, డాక్టర్ కె. సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలి - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 25 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 17, కుటుంబ కలహాలకు సంబంధించినవి 2, మోసాలకు పాల్పడినట్లు 4, ఇతర అంశాలకు సంబంధించినవి 2 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, డిసిఆర్బి ఎస్ఐ రాజేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్య సంరక్షనే ప్రభుత్వ లక్ష్యం..

● పోషణ్ పఖ్వాడా ద్వారా గర్భిణి స్త్రీలు, బాలింతలకు సంపూర్ణ పౌష్టికాహారం.. ● శాసనసభ్యులు గద్దె రామ్మోహన్.





**విజయవాడ,కలంకౌంటర్ :** గర్భిణి స్త్రీలు, బాలింతలకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందని తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అన్నారు. 7వ పౌష్టికాహార పక్షోత్సవం (పోషణ్ పఖ్వాడా) సందర్భంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు గర్భస్త దశ నుంచి రెండేళ్ల వరకు ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గర్భం దాల్చిన నాటి నుండి 270 రోజులు, బిడ్డ పుట్టిన నాటి నుండి 730 రోజులు కలిపి 1000 రోజుల పాటు బిడ్డకు సంరక్షణ ఇవ్వాలన్నది పోషణ్ పఖ్వాడా పథక ఉద్దేశమన్నారు. ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధపెట్టి లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేసుకునేలా మహిళల్లో అవగాహన కల్పించాలన్నారు. మహిళ సంక్షేమం పై ప్రత్యేక శ్రద్ధ వహించే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1995 నుండే మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా సమూహిక సీమంతాల కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల ఆరోగ్యం పరి రక్షణకు అనేక కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనూరాధ మాట్లాడుతూ పౌష్టికాహారం లోపం పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుండి అవసరమైన పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెట్టాలన్నారు. రక్త హీనత లేకుండా కూరగాయలు ఆకు కూరలు పండ్లు మాంసపుకృత్తులతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటుగా చేసుకోవాలన్నారు. పోషక విలువలు అధికంగా ఉన్న చిరుధాన్యాలను వినియోగించేలా మహిళలకు అవగాహన కల్పించాలని మహిళ శిశు సంక్షేమ అధికారులకు సూచించారు. అనంతరం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 50 మంది గర్భిణీ స్త్రీలకు గద్దె రామ్మోహన్ దంపతులు స్వయంగా ఒక్కొక్కరికి 1000 రూపాయలు, నూతన వస్త్రాలు పసుపుకుంకుమలు అందజేసి సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ సిడిపివో జి. మంగమ్మ, పిడియాట్రిషన్ డా. రవితేజ హ్యాపి చైల్డ్ దవలెప్‌మెంట్ రిహాబిలిటేషన్ సెంటర్ పిన్సిపాల్ గాయత్రి, టాటా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ యం. కిన్నెర, సూపర్‌వైజర్లు షేక్ రెహనాబేగం, సిహెచ్ శ్యామలత, ఎస్ సర్ణకుమారి, వి. మేరిహెలెన్, జె. కవిత, మహిళలు పాల్గొన్నారు.

## వినతులు స్వీకరిస్తున్న కొనకళ్ళ



**మంగళగిరి,కలంకౌంటర్ :** మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వారి సమస్యల పై వినతి పత్రాలను తీసుకుంటున్న ఏపి ఎస్ ఆర్టీసీ చైర్మన్ ,కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ రావు , టీడీపి నాయకులు.

## బ్రోచర్ ఆవిష్కరించిన ఎస్పీ



**విజయనగరం,కలంకౌంటర్ :** ఈ నెల 26 న జరగబోయే యువ సమ్మేళనం బ్రోచ ర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్.

## అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా



**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం టౌన్ నందు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం సందర్భంగా విచ్చేయుచున్న భక్తులకు కి"శే"గుంటక వెలుగొండారెడ్డి జ్ఞాపకార్థం సిద్ధార్ధ జూనియర్ కాలేజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజి శాసనసభ్యులు,మార్కాపురం వైస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు , నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత - జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్







**ఒంగోలు,కలంకౌంటర్ :** బాధితులు నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కారించుటకు కొరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీ కోసం) కార్యక్రమమును జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన 73 ఫిర్యాదిదారుల అర్జీలను జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు స్వీకరించి వారితో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. అందిన ప్రతి ఫిర్యాదు గురించి సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రజా ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూ వివాదాలు, జాబ్ ఫ్రాడ్, కుంటుంబ సమస్యలు, చీటింగ్ , ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మహిళా పియస్ డిఎస్పీ రమణ కుమార్, మహిళా పియస్ సీఐ సుధాకర్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ఇన్స్పెక్టర్ జగదీష్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ లో బివిఎం ప్రీతమ్ కు ఆల్ ఇండియా 129 ర్యాంకు



**కందుకూరు,కలంకౌంటర్ :** నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన భద్రిరాజు వెంకట మణి ప్రీతమ్ జేఈఈ మెయిన్స్ ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిర్లో 129 ర్యాంకును సాధించారు. శనివారం విడుదల చేసిన JEE MAINS పరీక్ష ఫలితాలలో 99.9945049 ప్రెసెంటిల్ తో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీ లో 129 ర్యాంక్ సాధించాడు. ప్రీతమ్ తల్లి తండ్రులు ఇద్దరు ఉపాధ్యాయులు. భద్రిరాజు నారాయణ మూర్తి (ZPHS, గుడ్లూరు గణిత ఉపాధ్యాయుడు), రజని(ZPHS, ముండ్లమూరివారిపాలెం, భౌతిక శాస్త్రం ) లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 14 లక్షల 75 వేల మంది జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాసిన తరుణంలో తమ కుమారుడికి 129 ర్యాంకు రావడం పట్ల ప్రీతమ్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారి బంధువులు స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## అంకితభావంతో విధులు నిర్వహించాలని కొత్తగా నియామక పత్రాలు

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** అంకితభావంతో విధులు నిర్వహించాలని కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్లో మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ శాఖకు చెందిన 12 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. వారిలో 8 మంది జూనియర్ అసిస్టెంట్లు కాగా, ఒకరు సచివాలయ కార్యదర్శి, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్లు ఉన్నారు.అందులో టి. మణి, సిహెచ్ గోపాలకృష్ణ, ఎస్ అజయ్ బాబు, డి కిరణ్ కుమార్, ఏ భరత్ కుమార్, ఎం చైతన్యకుమార్, వై అహల్య, సిహెచ్ భవాని శంకర్ జూనియర్ అసిస్టెంట్లుగా, వినోద్ కుమార్ సచివాలయ కార్యదర్శిగా పి సుజాత, యు వెంకటరావు, ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా నియమించబడిన ఉద్యోగులు వారికి అప్పగించిన విధులను అంకితభావంతో సజావుగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి శ్రీదేవి, జడ్పీసీఈవో కన్నమ నాయుడు, డ్వామా డి ఆర్ డి ఏ పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డిఎస్ఓ పార్వతి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, పౌరసరఫరాల సంస్థ డిఎం సి హెచ్ పద్మావతి,ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఈ లు లోకేష్, నటరాజు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, డిపిఓ అరుణ, సిపిఓ గణేషు, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలని, ఉయ్యూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఉయ్యూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఓపి బ్లాక్, ప్రసూతి వార్డు, తదితర వార్డులన్నిటిని చుట్టూ కలియ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడ ఉన్న రోగులతో ముఖాముఖి మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు ముఖ్యంగా ప్రసవం జరిగినప్పుడు ఎలా ఉన్నాయి, ఆహారము, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా లేదా అనే విషయాలపైన వారిని విచారించారు. అన్ని బాగున్నాయని రోగులు జిల్లా కలెక్టర్కు చెప్పగా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఏమైనా సమ స్యలు ఉన్నాయా అని కలెక్టర్ వైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తిని అడగగా ఆమె ట్రాన్స్ఫార్మర్ సమస్య ఉందని, లోడు ఎక్కువై ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అదనపు ట్రాన్స్ఫార్మర్ల కోసం అంచనాలు రూపొందించి విద్యుత్ శాఖకు పంపించాలన్నారు. తాను వారితో మాట్లాడి ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జిల్లా విభజన అయ్యాక పెనమలూరు పామర్రు కంకిపాడులో పోస్ట్ మార్టం చేసేందుకు సౌకర్యాలు లేవని ఆయా ప్రాంతాల నుండి ఆ కేసులన్నీ ఉయ్యూరుకె రావడంతో ఇబ్బంది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ కు వైద్యాధికారి చెప్పగా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి డిసిహెచ్ఎస్ శేషు కుమార్ తో మాట్లాడి మిగిలిన ప్రాంతాల్లో కూడా వీలైనంత త్వరగా పోస్టుమార్టం చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దారు సురేష్ కుమారు, ఎంపీడీవో శేషగిరిరావు, హెచ్ డి ఎస్ చైర్పర్సన్ జయదేవ్, డాక్టర్ స్వరూప, సిస్టర్ నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నిజాంపేట ఏ.యూ.పి.ఏ స్కూల్ , సోమవారం సర్కిల్ పేట లోని సరస్వతి ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లో మొత్తం 170మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో శాఖ అధ్యక్షులు డా. జొన్నలగడ్డ ఉషా కాంతి, కార్యదర్శి డా. థియఫిలస్ గుంజా, డా. రామకృష్ణ, డా. యువరాజ్, డా. సాయి తేజ, డా. రఘు తదితరులు పాల్గొన్నారు.. డా. దీప్తి, డా. సంతోషి మాట్లాడుతూ నోటి ఆరోగ్యం పట్ల అలసత్వం పనికి రాదు అంటూ విద్యార్థులకు దంత శుభ్రత పై అవగాహన కలిగించారు. అనంతరం జిల్లా కార్యదర్శి డాక్టర్ థియొఫిలస్ మాట్లాడుతూ కృష్ణా డెంటల్ అసోసియేషన్ ద్వారా నోటి , దంత ఆరోగ్యం పట్ల అవగాహనా కార్యక్రమాలు ఇకపై క్రమం తప్పక నిర్వహిస్తామని తెలిపారు.

# ఘనంగా బురకాయల అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ..



**పిట్టలవాని పాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** పిట్టలవానిపాలెం మండలం దేగలవారిపాలెం గ్రామంలో బురకాయ అంకమ్మ వారి నూతన దేవాలయం లో ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు . ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిజామ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు అఫ్జల్, వెంకటపతిరాజు,నరసరాజు,దేగల శ్రీనావాసరెడ్డి,ఏడుకొండలురెడ్డి,దేగల శ్రీనావాసరెడ్డి,సుబ్బారెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి,పొగాకు,శనగ, మొక్కజొన్న,వరి రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి... గాదె మధుసూదన రెడ్డి





**ఇంకొల్లు, (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త , రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన రెడ్డి ఆధ్వర్యంలో ఇంకొల్లు మండల కేంద్రంలో రైతులతో కలసి భారీ ర్యాలీతో స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు రైతుల పడుతున్న ఇబ్బందులు గూర్చి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎలక్షన్ హామీలలో భాగంగా రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మిర్చి, పొగాకు,శనగ,వరి,పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక కొనేవారు లేక రైతు ఆరుకాలం చెమటోడ్చి కష్టపడి పండించిన పంటను అమ్ముకోవటానికి నానా ఇబ్బందులు పడుతుంటే ఈ కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కిస్తూ రైతులు ఆత్మహత్యలకు పాల్పడుచున్న చోద్యం చూస్తూ వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరం అని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతు పక్షాన పోరాడుతుందని తెలియజేశారు.




తిరువూరు పట్టణం లోని స్టేట్ బ్యాంకు మరియు యాక్సిస్ బ్యాంకు కరెంట్,సేవింగ్ మరియు ఫిక్సెడ్ డిపాజిట్ ఖాతాదారులు తమ లావాదేవీలకు సంభందించి డిజిటల్ అరెస్టు మరియు సైబర్ నేరాల పై ... తిరువూరు ఎస్సై కెవిజీవి సత్యనారాయణ ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బంది మరియు ఖాతా దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు

**–తిరువూరు,కలంకౌంటర్ :**

# శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశ్వీరచనంతో ముగిసిన మూడు రోజుల శ్రీ గీతా మందిర మహా సంప్రోక్షణ కుంభాభిషేకం

- చివరి రోజున కల్యాణోత్సవానికి హాజరైన శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి
- మూడు రోజులపాటు ఆధ్యాత్మిక శోభను సంతరింప చేసుకున్న నున్న





**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** విజయవాడ రూరల్ మండలం నున్నలోని శ్రీ గీతా మందిరంలో మూడు రోజుల పాటు జరిగిన మహా సంప్రోక్షణ కుంభాభిషేకం ఆధ్యాత్మిక శోభను పురస్కరించుకుంది. శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనంతో మూడు రోజుల మహా సంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ పవిత్ర కార్యక్రమం దైవిక కలయికను చూసేందుకు, దీవెనలు పొందేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు నున్నకు తరలివచ్చారు. తిరుపతి సమీపంలోని ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమానికి చెందిన పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, ఉత్తరాదికారి శ్రీ అసంగానందగిరి స్వామి, వేద పండితుడు రొంపిచర్ల దత్త కుమార్‌తో ఆధ్వర్యంలో వైదిక సంప్రదాయాలను పాటిస్తూ వేద పండితులు శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనం నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమాలలో భాగంగా శ్రీ గీతా మందిరంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడికి విశేష అలంకారాలు చేసి పవిత్రమైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో విష్వక్సేన పూజ, పునహవాచన, అగ్నిధ్యానం, నిత హెూమం, ఉత్త హెూమం మరియు మహా పూర్ణాహుతి ఉన్నాయి. ఈ పూజా కార్యక్రమాలు పూర్తయిన భక్తులకు దర్శనంతోపాటు శ్రీకృష్ణునికి నైవేద్యాలు సమర్పించే అవకాశం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఎలాంటి రద్దీ లేకుండా ఉండేందుకు నిర్వాహకులు నిర్ణీత క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. శ్రీ గీతామందిర మహ సంప్రోక్షణ కుంభాభిషేకం ముగిసిన అనంతరం శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి విశ్వాసం, ధర్మం, భక్తి శక్తి అనే అంశాలను ఉద్ఘాటిస్తూ స్ఫూర్తిదాయకమైన భక్తి ప్రసంగాన్ని అందించారు. సానుకూల ఆలోచనలతో నిండిన జీవితాలను గడపాలని, ఆనందాన్ని దైవిక బహుమతిగా స్వీకరించాలని చెప్పారు. ప్రతి జీవిలో దైవత్వం ఉంటుందని, భగవంతునిపై అచంచలమైన విశ్వాసం ఉంచే వారు కాపాడబడతారని ఆయన తెలియజేశారు. ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం విశేష పాత్రను హైలైట్ చేస్తూ, నిజమైన భక్తుడు గురువుకు కీర్తిని తెచ్చిపెట్టేవాడని, గురుదేవుల నుండి విశ్వాసులకు ఆశీర్వాదాలు ప్రవహించేలా చూస్తాడని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా శ్రీ గీతా మందిర భక్తబృందం 'అన్న సంతర్పణ' నిర్వహించింది. ఇదిలావుండగా, మూడు రోజుల వేడుకలను సజావుగా పూర్తి చేసేందుకు నున్న రూరల్ పోలీసులు భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు చివరి రోజున గ్రామంలోని శ్రీ గీతా మందిరం ప్రాంతంలో ట్రాఫిక్ మళ్లింపును అమలు చేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో విజయ-వాడ రూరల్ తహశీల్దార్ బి.సుగుణ, నున్న రూరల్ పోలీస్ స్టేషన్ (పాయకాపురం) ఇన్‌స్పెక్టర్ పి కృష్ణమోహన్, ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి జిటివి రమణ, నున్న పంచాయతీ కార్యదర్శి డి శ్రీనివాసరావు సహా స్థానిక ప్రముఖులు విచ్చేశారు. సోమవారం విజయవాడ సమీపంలోని నున్నలో శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, ఉత్తరాధికారి అసంగానందగిరి స్వామి, అర్చక స్వామి రొంపిచర్ల దత్త కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీ శ్రీనివాస కళ్యాణ మహదాశీర్వచనం నిర్వహించారు. విజయవాడ సమీపంలోని నున్నలో మూడు రోజుల పాటు సాగిన గీతా మందిరం మహా సంప్రోక్షణ కుంభాభిషేకం ముగింపు సందర్భంగా సోమవారం జరిగిన శ్రీ శ్రీనివాస కళ్యాణ మహదాశీర్వచనం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ







**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎన్ టి ఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ళ చిన సత్యం బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి మజ్జిగ పంపిణీ తిరువూరు లో ప్రారంభించిన విషయం గుర్తు చేస్తూ మండల సంఘాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జంగాల మురళీకృష్ణ, సెక్రటరీ. నాళ్ళ సురేంద్ర,ట్రెజరర్ పీవీ రావు , వాసవి సేవాదళ్ చైర్మన్. దోసపాటి రవికుమార్., పి ఆర్ ఓ నాళ్ళ సుధాకర్ , గుడిమెట్ల రాము,బొడ్డు శ్రీను,జవ్వాజి సాయికృష్ణ,జవ్వాజి శ్రీనివాసరావు ,గార్లపాటి లక్ష్మీకాంత్. చిట్టి, కోరుకొండ ధర్మారావు, దోసపాటి శ్రీనివాస్ ,కొత్తగుండ్ల జనార్ధన్ రావు. ,చిట్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

# నూతన సి.సి డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని 25 వ వార్డు గాయత్రి నగర్ లో సోమవారం ఉదయం 10 లక్షల రూపాయల తో నిర్మిస్తున్న నూతన సి.సి డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు... ముందుగా ఈ శంకుస్థాన కార్యక్రమమునకు విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు కి వార్డు పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు కాంట్రాక్టర్ ఘన స్వాగతం పలికారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ గణపతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు గుర్రం మాల్యాద్రి, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, కండ్రా మాల్యాద్రి, పెంట్రాల సుబ్బారావు, గుర్రం మల్లికార్జున, బత్తిన వెంకయ్య, బత్తిన మాల్యాద్రి, చిట్టాబత్తిన మాలకొండయ్య, నవులూరి మాలకొండయ్య, పొడపాటి నాగేశ్వరరావు, రావూరి రామకోటయ్య, ముచ్చు వేణు, శ్రీహరి నాయుడు కాంట్రాక్టర్ కండ్రా నర్సయ్య, దివి శంకర్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు...

# ఉత్తమ ఎన్.సి.సి కేడెట్‌గా అవార్డు పొందిన ప్రకాశం విద్యార్థిని ప్రియంవధ



**కందుకూరు,కలంకౌంటర్ :**24(A) బెటాలియన్, నెల్లూరు, ప్రకటించిన ప్రకారం, ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల, కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన చివరి సంవత్సరం బి.టెక్ విద్యార్థిని పి. సాయి లక్ష్మి ప్రియంవద %-% ఫైరింగ్, డ్రిల్ టెస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి,ఉత్తమ ఎన్.సి.సి కేడెట్ అవార్డును గెలుచుకున్నారు. ఈ ఘనతను ప్రకాశం కళాశాలలో ఉన్న 34(A) బెటాలియన్, ఎన్.సి.సి, ఒంగోలు కేడెట్‌గా సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు రూ. 4500 నగదు బహుమతిని లెఫ్టినెంట్ కల్నల్ మోహన్.వి, సుబేదార్ మేజర్.పుష్పరాజ్.కె.యం చేతుల మీదుగా అందజేశారు. ఈ పురస్కారం కాలేజీకి గర్వకారణం. ప్రియంవద కృషి, పట్టుదల మరియు నిబద్ధత ఈ విజయంలో ముఖ్యపాత్ర పోషించిందని , కళాశాల కరస్పాండెంట్ డా. కంచర్ల రామయ్య అభిప్రాయపడ్డారు. కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డా. కంచర్ల విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్.సి.సి శిక్షణ విద్యార్థుల్లో సజీవత, సమర్పణ భావనను కలుగజేస్తుంది. ప్రియంవద అందించిన ఈ ఘనత విద్యార్థులకు ఉత్తేజాన్ని కలిగిస్తుందని హర్షం వ్యక్తపరిచారు. తమ కళాశాల ఎన్.సి.సి కేడెట్లలో నైతిక విలువలు, నాయకత్వ నైపుణ్యాలు, క్రమశిక్షణను పెంపొందించే విధంగా శిక్షణ అందించబడుతుంది. ప్రియంవద ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ డా. సి.హెచ్.రవి కుమార్ పేర్కొన్నారు. ప్రియంవద పోటీల్లో ప్రదర్శించిన ప్రతిభ 34 (A) బెటాలియన్‌కే గౌరవాన్ని తీసుకువచ్చిందని ఎన్.సి.సి కోఆర్డినేటర్ ఎస్.ఎన్. మీరావలి పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు ఆమెను హృదయపూర్వకంగా అభినందించారు. ఈ విజయం విద్యార్థులలో ఎన్.సి.సి పట్ల ఆసక్తిని పెంపొందించే దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

# పోషన్ పక్వాడా కార్యక్రమం





**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** ఛందోలు గ్రామంలో సోమవారం అంగన్వాడీ శాఖ పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ అరుణ కుమారి మాట్లాడుతూ ఎవరైనా గర్భవతి అని తెలిసినా నాటి నుండి బిడ్డకు రెండు సంవత్సరాలు వయ-సు నిండే వరకు సుమారు1000రోజుల పాటు పౌష్టికాహారం గురించి,పోషనవిలువలు గురించి తెలియజేయడం జరుగుతుంది అన్నారు. అంతే కాకుండా తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలి వివరించారు. అనంతరంఎం పి హెచ్ ఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య సేవలు ఎలా చేస్తారో వివరించారు. అంగన్వాడీ కేంద్రాల నుండి లభించే ఆహారం వృధా కాకుండా చేసుకోవాలి అని మరో సూపర్ వైజర్ రాధ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు ,గర్భిణులు పాల్గొన్నారు.

# పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందజేస్తాం

**- నగర కార్పొరేషన్ కమిషనర్. సిహెచ్ వివిఎస్ బాపిరాజు**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగర కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ తో కలసి సోమవారం మచిలీపట్నం నగరం 45వ డివిజన్ నందు గల శ్రీ రాయపాటి శ్రీరాములు మెమోరియల్ పార్క్, ఇండోర్ స్టేడియం లను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు మాట్లాడుతూ.45వ డివిజన్ లోని సిడింబి అగ్రహారంలో గల మున్సిపల్ పార్కును ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే 45వ డివిజన్ లో ఇండోర్ స్టేడియం వర్షం వస్తే మునిగిపోతోందని స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేడియంలో వర్షపునీరు నిల్వ ఉండకుండా మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో మెరక చేయించడం జరుగు తోందన్నారు. 45వ డివిజన్ లో గల పశువుల ఆసుపత్రి నందు కూడా చాలా పల్లంగా ఉంది అని, పశువుల ఆసుపత్రికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రి కొల్లు రవీంద్ర, మున్సిపల్ అధికారుల సహకారంతో పశువుల ఆసుపత్రిని కూడా చాలావరకు మెరక చేయించడం జరిగిందన్నారు. సిడింబి అగ్రహారంలో రెవెన్యూ కళ్యాణ మండపం ముందర రోడ్డు నందు, నారాయణ స్కూల్ ముందర రోడ్డు నందు వర్షం వస్తే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు, ఎస్టిమేషన్లు వేసి అప్రోచ్లు వేయించుటకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ వర్షం వస్తే డివిజన్ లోని రేవతి సెంటర్, బస్టాండ్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్ పూర్తిగా మునిగిపోతుందని వెంటనే డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయించి, కల్వర్టర్లు అవసరమైన చోట వేయించి ప్రజల కు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు.

# ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ప్రధానోపాధ్యాయులు సహకారం అందించాలి

**● జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, ఇంటర్మీడియట్ విద్యాశాఖధికారి పి బి సాల్మన్ రాజు**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రభుత్వ కళాశాల లలో మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభం అయిన సందర్భంగా సోమవారం స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో మచిలీపట్నం అర్బన్ మరియు రూరల్ ప్రధానోపాధ్యాయుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం లో సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల ల్లో నైపుణ్యం కలిగిన విద్య బోధనా, అర్హత కలిగిన అధ్యాపకులు ఉండడం వలన ఫలితాలు అద్భుతం గా వస్తున్నాయ్ అని అన్నారు. ప్రభుత్వ కళాశాల లో విద్యార్థులు అందరికి ఉచితంగా టెక్ట్ బుక్స్, నోట్ బుక్స్, రికార్డు లు, బ్యాగ్ లు మధ్యాహ్నం ఉచితంగా భోజనం సదుపాయాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు ఈ విద్యా సంవత్సరం నుండి ఎంసెట్ మెటీరియల్ ఉచితంగా ఇస్తునట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు అందరూ ప్రభుత్వ కళాశాల ల్లో ప్రవేశాలకు పూర్తి సహాయ సహకరాలు అందించాలని అయన కోరారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపా ల్ సుందరలక్ష్మి, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎన్సీసీ దేశభక్తి కి ప్రతీక : జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** విలువలతో కూడిన క్రమశిక్షణకు, దేశభక్తికి ఎన్సీసీ ప్రతీక అని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. స్థానిక చిలకలపూడి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎన్సీసీ క్యాడెట్ల క్యాంప్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ తానుకూడా విద్యార్థి దశలో ఎన్సీసీ క్యాడెట్నే అని అప్పటి అనుభవాల్ని గుర్తు చేసుకున్నారు. ఎన్సీసీ ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేసారు. ఎన్సీసీ శిక్షణలో తీసుకున్న రైఫిల్ ట్రైనింగ్ ఉద్యోగం వచ్చాక పోలీసు శిక్షణలో ఎంతో ఉపయోగపడిందని స్పష్టం చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా చదువును మాత్రం నిర్లక్ష్యం చేయకుండా లక్ష్య సిద్ధితో జీవితంలో ముందుకు సాగినప్పుడే చరిత్ర సృష్టించగలమని ఉద్బోధించారు. జిల్లా విద్యా శాఖాధికారి రామారావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితం లో విద్యార్థి దశ ఎంతో కీలకమని , అలాంటి విద్యార్థి దశకు ఎన్సీసీ శిక్షణ మరింత వన్నెచేకూరుస్తుందని వెల్లడించారు. ఎన్సీసీ ద్వారా చక్కని శారీరక ధారుడ్యంతో పాటు ఆత్మస్థైర్యం, సమయస్ఫూర్తి వంటి సుగుణాలు అలవడతాయని వివరించారు. అనంతరం ఎన్సీసీ క్యాడెట్లకు క్యాంప్ కిట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారుడు డీవీఆర్, పాఠశాల ఎన్సీసీ ఆఫీసర్ అప్పినేడి వెంకటరామాంజనేయులు(రాము), ఉపాధ్యాయులు ఇబాదతుల్లా, సింహాద్రి, అతావుల్లా, శ్రీమన్నారాయణ, ఉషాకిరణ్, శివ, రత్నరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి – జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రజల నుండి అందే అర్జీల పట్ల అత్యంత శ్రద్ధ వహించి సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మెప్మా పిడి సాయిబాబు, పౌరసరఫరాల సంస్థ డిఎం సిహెచ్ పద్మావతి లతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక–మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్యంగా దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. కలెక్టర్ వేదిక దిగి దివ్యాంగుల దగ్గరికి వచ్చి వారి సమస్యలను ఎంతో ఓపిగ్గా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

**ఆమేరకు కలెక్టరేట్లో 201 అర్జీలు అందాయి. వాటిలో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి:** పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగులు చెన్నకేశవుల రాజా సురేష్ చక్రాల కుర్చీలో తన తల్లి శివమ్మతో కలిసి మీకోసం అర్జీ పట్టుకుని రాగా జిల్లా కలెక్టర్ వేదిక నుండి క్రిందకు దిగివచ్చి అతనితో మాట్లాడి అతని సాధకబాధకాలు ఎంతో ఓపిగ్గా విన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనకు లంకపల్లి గ్రామంలో సర్వే నంబర్ 158/5 లో 60 సెంట్లు భూమి ఉందని అది గత 60 సంవత్సరాలుగా తన స్వాధీనంలో ఉండేదని, ఇటీవల తన వదిన 10 మందితో కలిసి వచ్చి ఆ భూమిని ఆక్రమించుకుని దుక్కి దున్నించుకున్నారన్నారు. తమ పొలం జోలికి రాకుండా పోలీసు రక్షణ కల్పించాలని, వారి నుంచిప్రాణ రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోడూరు మండలం సాలెం పాలెం గ్రామానికి చెందిన మరో దివ్యాంగురాలు కొప్పనాతి మండలం అనూహ్యను వారి తల్లి విజయ మోసుకుని మీకోసంకు రాగా వారితో జిల్లా కలెక్టర్ వేదిక నుండి దిగివచ్చి నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలు తల్లి విజయ మాట్లాడుతూ తన కుమార్తెకు కంటిచూపు పోయిందని, మెదడులో రక్తం గూడు కట్టిందని, ప్రస్తుతం 6000 రూపాయల నెలసరి పించను అందుతుందన్నారు. తన కుమార్తె ఎప్పుడు మంచంలోనే పడుకుని ఉంటుందని, దగ్గరుండి అన్నీ తామే చూడాలని ఆమెకు 15 వేల రూపాయల నెలసరి పింఛను మంజూరు చేయాలని, వైద్యానికి ఖర్చు అవుతుందని జిల్లా కలెక్టర్కు వివరించారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పరిశీలించి ఆ అమ్మాయికి నిబంధనల ప్రకారం పింఛను పెంచేందుకు అవకాశం లేదని వివరిస్తూ ఉచితంగా వైద్య సేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్ ను, డిఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ, జిజిహెచ్ పర్యవేక్షకులు డా .ఆశాలతను ఆదేశించారు. ముదినేపల్లి మండలం వైవాక గ్రామ కాపురస్తురాలు మోదుగుమూడీ వీర వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన కుమార్తె పూజ 2023–24 సంవత్సరంలో కృష్ణా జిల్లాలోని ఉయ్యూరు మండలంలో కలువపాముల గ్రామంలో ఉన్న జ్యోతి పాలిటెక్నిక్ నందు మొదటి సంవత్సరం ఫీజు రీయింబర్స్మెంట్ పథకం కింద చేరిందన్నారు. అయితే 2023u24 లో తల్లిదండ్రులు అకౌంట్లో గాని, 2024u25లో కాలేజ్ అకౌంట్లో గాని ఇప్పటివరకు గవర్నమెంట్ ఇచ్చే ఫీజు జమ కాలేదన్నారు. తాను రోజు కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నానని, కళాశాలలో తన కుమార్తెతో పాటు చదువుతున్న ఇతర తోటి విద్యార్థులకు ఫీజులు మంజూరయ్యాయని, తన కుమార్తె చదువు మధ్యలో ఆగిపోకుండా రెండు సంవత్సరాల ట్యూషన్ ఫీజును మంజూరు చేయవలసిందిగా కోరుతూ అర్జీ అందజేశారు. మచిలీపట్నం 11వ వార్డు ఆశీర్వాదపురంకు చెందిన వేమూరి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తన ఇంటి చుట్టూ మునిసిపల్ రహదారిని బొందెల ప్రేమానందం మూడు వైపులా ఆక్రమించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. మచిలీపట్నం చిలకలపూడి 5 వ వార్డు లేఅవుట్ నివాసితులు లీలా ప్రభావతి, వి. భారతి, సిహెచ్ రమాదేవి మాట్లాడుతూ దేవి సెంటర్ లేఅవుట్ లో 41/81 ఆర్ఎస్ నెంబర్ 368/2లో ప్లాట్ నెంబర్ 11 లో సోడిశెట్టి అయ్యప్ప ప్రజల నివాస ప్రాంతంలో కోళ్ల ఫారం పెంపకం పెడుతున్నట్లు తెలిసిందని, దానివల్ల దుర్వాసన, ప్రజలు ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆ కోళ్ల ఫారానికి అనుమతి ఇవ్వరాదని కోరుతూ విజ్ఞాపన పత్రం అందజేశారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552 300009, సైబర్ క్రైమ్ నివారణకు టోల్ ఫ్రీ నెంబర్ 1930, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ సైబర్ క్రైమ్ డాట్ జివో వి ఇన్, మహిళలు చిన్నారుల భద్రతకు శక్తి యాప్ ఉపయోగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కరపత్రాలను, గోడపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కరపత్రాలను గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పోషణ్ అభియాన్ 7 వ పౌష్టికాహార పక్షోత్సవం పేరుతో జిల్లా మహిళా శిశు అభివృద్ధి శాఖ రూపొందించిన గోడ పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. మొదటి గర్భస్థ దశ నుండి 2 సంవత్సరాల వరకు 1000 రోజుల సంరక్షణపై శ్రద్ధ వహించాలని, లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషణ్ ట్రాకర్ లో నమోదు చేసుకునే విధానం పట్ల ప్రచారం చేయాలని, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలు చేయడం ద్వారా పిల్లలలో పోషకాహారం లోపం నివారించాలని, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటుచేసుకునేలా అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 20,768 అర్జీలు అందగా అందులో 19,509 అర్జీలు పరిష్కరించారని, ఇంకనూ 1259 అర్జీలు సకాలంలో పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో కన్నమ నాయుడు, డ్వామా డి ఆర్ డి ఏ పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డిఎస్ఓ పార్వతి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట,ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఈ లు లోకేష్, నటరాజు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకట్రావు, డిపిఓ అరుణ, సిపిఓ గణేషు, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలి





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** బెంగాల్లో జరుగుతున్న హిందువుల పై దాడిని ఖండిస్తూ బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము కి వినతి పత్రం జిల్లా కలెక్టర్ ద్వారా సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు ఒరే రాజశేఖర్ మచిలీపట్నం ప్రకండ అధ్యక్షులు పులవర్తి శ్రీనివాస్ బజరంగ్దళ్ సభ్యులు , ఆర్ఎస్ఎస్ బిజెపి నాయకులు. ,సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి సేవ సమితి ప్రారంభం



**మచలీపట్నం,కలంకౌంటర్ :** శ్రీ సద్గురు సాయి సేవ సమితి, కనిగిరి వారి స్వచ్ఛంద సంస్థను కృష్ణాజిల్లా గూడూరు నందు రామ్ రతన్ జి ఆశ్రమములో సోమవారం బాబా స్తూపం ప్రారంభ సందర్భంగా శ్రీ రామ్ రతన్ బాబా ఆశీస్సులతో శ్రీ విశ్వధానంద భారతి మాతాజీ తమ అమృత హస్తములతో ఆవిష్కరించారు. ఈ సంస్థ ద్వారా బాబా తత్వ ప్రచారము, సేవా కార్యక్రమములు నిర్వహించి అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మానుగుంట మహీధర రెడ్డి, ముక్కు కాశి రెడ్డి , ప్రకాశం జిల్లా సాయి మందిరాల ట్రెజరర్ దేవకి సుబ్రహ్మణ్యం, సాయిబాబా ఆలయ ట్రెజరర్ ముచ్చర్ల ధర్మారావు, ముక్కు బాలకృష్ణారెడ్డి, బ్రహ్మయ్య స్వామి,బాబా ఆలయ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, సింగరాజు మాలకొండ ఈశ్వరరావు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# జీవితాల్లో వెలుగులు నింపడం ఒక విద్య తోనే సాధ్యం... పెడన ఎమ్మెల్యే కాగిత





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** మన జీవితాల్లో వెలుగులు నిండాలంటే అది ఒక విద్యతోనే సాధ్యమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. బంటుమిల్లి మండలంలోని పెద్ద తుమ్మిడి జిల్లా పరిషత్ హై స్కూల్ కు ?2,01700/–, ముంజులూరు జిల్లా పరిషత్ హై స్కూల్ కు?4,27,750/–మల్లపరాజు గూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ కు?131200/లు విలువగల ఫర్నిచర్ ను డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ సహకారంతో సోమవారం ఆయా పాఠశాలలలో జరిగిన కార్యక్రమాల్లో ఆయా పాఠశాలలకు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని క్రమశిక్షణ సమయపాలన తో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అలాగే నేటి సమాజం డిజిటల్ గా మారిపోయిందని సమాజంలో జరుగుతున్న మార్పులు దృశ్య ప్రతి ఒక్క విద్యార్థి సాంకేతికతను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కూటమీ ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యాబోధన ద్వారా భారత దేశ భవిష్యత్తుకు విద్యార్థులను తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు ఉపాధ్యాయులు అలాగే కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com